మగాడినన్న అహంకారంగల అతడికి కలిగిన పరాభవం?

నారంశెట్టి ఉమామహేశ్వరరావు కథ

# చెప్పుదెబ్బ

"ఫిజిక్స్ లెక్చరర్ మాధవరావేంటి? ఆడపిల్లను చూస్తే అలా బిగుసుకుపోతాడు. గొప్ప బెదురుగొడ్డు అతడు" సురేఖ నవ్వుతూ అంది.

"అతడి మాటకేంగానీ, మన క్లాసులో ఆ చివర కూర్చునే శేఖర్ ఉన్నాడు చూడూ! పొడుగ్గా వంకీల జుత్తు. అతడేమిటీ ఆడపిల్ల కనబడితే చాలు నోరు వెళ్లబెట్టి చొంగ కార్చేస్తాడు. డర్టీ ఫెలో!" అంది కల్పన మరింత నవ్వుతూ.

వారు మాట్లాడుతుంటే నవ్వి ఊరుకుంది కానీ ఏమీ కామెంటు చేయలేదు సుందరి. వాళ్ళు ముగ్గురూ బిఎస్సీ ఫైనలియర్ స్టూడెంట్స్. ఏవో ప్రాక్టికల్స్ ఉంటే ముగించుకొని బస్టాప్ కొచ్చి నిలబడ్డారు.

ఇంతలో బస్సు వచ్చింది. ముగ్గురూ బస్సు ఎక్కారు. వీరి ముగ్గురిలో ఎవరికీ సీటు దొరకలేదు.

"టికెట్ టికెట్" అంటూ ఆడవారిని వీలైనంత గట్టిగా హత్తుకుంటూ కండక్టర్ వీరి దగ్గరకు వచ్చాడు. కండక్టరు బుద్ధి గమనించి అతడికి తమ శరీరం తగలకుండా జాగ్రత్త పడుతూ టిక్కెట్లు తీసుకున్నారు.

ముగ్గురూ ఒకే రూటు వెళుతున్నా సుందరి తప్ప మిగిలిన ఇద్దరూ ముందే దిగిపోతారు; వారికంటే మరో నాలుగు స్టాపులు ఎక్కువ ప్రయాణించాలి సుందరి.

సుందరి నిలబడ్డ స్థలానికి దగ్గరలో ఒక యువకుడు నిలబడ్డాడు. అతడుటిప్ టాప్ గా తయారయి ఉన్నాడు. సుందరి బస్సె



క్కన దగ్గర నుండి ఆమెను చూస్తున్నాడు. ఆమె అందాన్ని కొరుక్కుతినేలా చూస్తున్నాడు. అవకాశం వస్తే చాలు ఆమెను తాకడమో, ఇంకేదో చేయాలని ప్రయత్నిస్తున్నాడు.

'అగ్నికి గాలి సాయం' అన్నట్లు కండక్టర్ 'ఎదరకు జరగండి' అన్న మాటలు విని మరింత ముందుకు జరుగుతున్నాడా యువ

కుడు.

అతడు దాదాపు సుందరి ప్రక్కకు వచ్చి నిలబడ్డాడు. సుందరి అతణ్ణి పట్టించుకోలేదు ముందు. బస్సు సడన్ బ్రేకువేసినా, మలుపు తిరిగినప్పుడు వాలినా ఇతడు వెళ్ళి సుందరిపైపడుతున్నాడు.

అప్పుడు చూసింది సుందరి అతని వైపు. మనిషి తెల్లగా, బలంగా ఉన్నాడు. ఇరవై రెండు, ఇరవై అయిదు మధ్య ఉండవచ్చు! మనిషి చూడడానికి బాగా ఉన్నాడు. మరి అతడు తన మీద పడడం యాదృచ్ఛికమా? క్షణకాలం ఆలోచించి ఏ విషయమూ నిర్ధారించుకోకముందే అతని చేయివచ్చి సుందరి భుజం మీద పడింది.

బస్సు సడన్ బ్రేక్ వేశాడు. అతడు ముందుకు తూలి పడకుండా ఆ చేయి తన మీద వేసి ఆపుకున్నాడా? లేక అదను దొరికిందని సడన్ బ్రేక్ వేసినప్పుడే చేయి వేశాడా? మరి తనేమో రాడ్ పట్టుకుని ఒక సీటుకి చేరబడి నిలబడింది. పెద్దగా షేక్ అవలేదు అందుకే! ఏమైనా సుందరికి అతని ప్రవర్తన నచ్చలేదు.

అతన్ని పిలిచి అతనికి మాత్రమే వినబడే టట్లుగా ''కొంచెం మర్యాదగా ప్రవర్తించండి. మాట్లాడితే మీద పడడం బాగులేదు. ఏదయినా రాడ్ పట్టుకోండి. లేదా హేంగర్స్ పట్టుకోండి. అందరిలో మిమ్మల్ని ఇన్‌సల్ట్ చెయ్యడం ఇష్టంలేక నెమ్మదిగా చెబుతున్నాను'' అంది.

నిజంగా అదే ఆమె చేసిన పొరపాటు.

ఆ యువకుడు బుద్ధిగా తల ఊపాడు. ఈ విషయం సుందరి చెబుతుండగా అతనువినడం బస్సులోవాళ్లు చాలా మంది చూశారు. ''తెలిసిన వాళ్ళు కాబోలు మన కెందుకు ఏం మాట్లాడుకుంటే'' అనుకొన్నారు.

సురేశ్, ప్రక్కన బస్సుదిగిపోయారు. సుందరి ఒక్కర్తే మిగిలింది. తన స్టాప్ రావడానికి ఇంకా ఎంతసేపుండాలా అని సుందరి అనుకుంటుండగా ఏదో స్టాప్ వచ్చింది.

సుందరి పక్కన నిల్చున్న యువకుడు ఒక్కసారి ముందుకొచ్చి నెమ్మదిగా ఆమెకు వినపడేలా ఏదో చెప్పడానికి ప్రయత్నించిన ట్లు వంగాడు. అతడేం చెబుతాడో వినాలన్న ఉత్సుకతో ఎదురుచూస్తున్న సుందరికి జరిగిం దేమిటో తెలిసేసరికి క్షణకాలం స్థాణువయిం ది.

అతడు తన పెదాలను గాఢంగా ముద్దు పెట్టుకున్నాడు. అంతేకాక ''నీ దిక్కున్న దగ్గర చెప్పుకో'' అని ఆమెకు మాత్రం వినబడేలా చెప్పి గబగబా దిగిపోయాడు.

సుందరి ఈ నిజాన్ని జీర్ణించుకోలేకపో యింది. ముక్కుపుటాలదిరాయి. కోపంతో కళ్ళు ఎరుపెక్కాయి. అయితే ఏం లాభం? ఏమీ చేయకముందే దిగిపోయాడతడు.

బస్సులో చాలా మంది ఈ దృశ్యం చూశారు. అంతకుముందు సుందరి అతడి తో ఏదో నెమ్మదిగా మాట్లాడడం బట్టి వారికి పరిచయం ఉండడమో లేక ప్రేమికు లో అయి ఉంటారని అనుకున్నారు.

ఆ రోగ్‌కి తనకీ ఏమీ సంబంధం లేదనీ, వాడెవడో దారిన పోయే దానయ్యనీ అరచి గోల పెట్టాలని ఉంది సుందరికి. ఈ విషయాన్ని గుండెల్లోనే సంక్షిప్తం చేసి

గుప్తంగా ఉంచి దొరికినపుడు పులిలా లంఘించి వాడి భరతం పట్టడానికి ఎదురు చూడాలని నిర్ణయించుకుంది.

సుందరి మాత్రం వాణ్ణి మరచిపోలేదు. వాడి కోసం తను ఎక్కే ప్రతీ బస్సులోనూ చూసేది.

ఆ రోజురానే వచ్చింది. మళ్ళీ అంతకు ముందువలె సుందరి తన ఫ్రెండ్స్‌తో ఇంటికి వెళ్ళే బస్సు ఎక్కితే అందులో కన్పించాడా డర్టీఫెలో!

వైట్‌షర్ట్ బ్లాక్ పేంటులో ఇన్‌షర్ట్ చేశాడు. జేబులోనుండి పైకి కన్పిస్తున్నాయి రెండు వందనోట్లు. బస్సురద్దీగా ఉండడంవల్ల అతడు సుందరిని చూడలేదు. సుందరి మాత్రం ఒక ప్రక్కనుండి వంగి లోపలకు చూస్తే కన్పించాడతడు. ఆ యువకుడి జేబులో నుండి వంద రూపాయల కాగితం నెంబర్ క్లియర్‌గా కన్పిస్తుంటే వెంటనే నోట్ చేసుకుంది సుందరి.


సుందరి నెమ్మదిగా కల్పన అనే తన ఫ్రెండుకి వినబడేలా "నేనిప్పుడో ట్రిక్ ప్లే చేసి వాడికి దెబ్బలు కొట్టిస్తాను. మీరు సాయం చేయండి. అవసరమయితే" అంది. కల్పన నోరు తెరిచి ఉండిపోయింది.

'ఏం కొంపముంచే పని చేస్తుందో" అనుకుని అలాగే అంది నెమ్మదిగా గొంతు పెగల్చుకుని ఈ విషయం సురేఖతో కూడా చెప్పింది.

అలా అనడం తడవు వారిద్దరూ వెనక్కు జరిగి సుందరికి దారిచ్చారు. కాస్త నెమ్మదిగా ఒకడుగు మగవాళ్ళ వైపు వేసింది

తన ముఖం అతడికి కనబడకుండా జాగ్రత్త పడింది సుందరి.

సుందరి ఇప్పుడు అతడి ప్రక్కనే నిలబడి ఉంది. అతడికి ఆడ పిల్లల మీద చేయి వేయడం వెన్నతో పెట్టిన విద్యో లేక చేతులు ఊరుకోవో తెలియదు గానీ సుందరి



పైకి పడడానికి ప్రయత్నించాడు.

అంతే! సుందరి ఇటునుండి అటు తిరిగి కొట్టిన చెంపదెబ్బకు అతడి కళ్ళు బైర్లు కమ్మాయో లేదో తెలీదు కానీ కళ్ళజోడు మాత్రం బస్ విండోలోంచి బయటపడి చిదికిపోయింది.

"స్టుపిడ్! ఆడదాన్ని ఏం చేయలేనని అనుకున్నావురా? దొంగవెధవా? ముందు ఆ డబ్బు పైకి తీయ్" అంది మరింత కోపంగా.

ఆ సంఘటనతో బస్సులో అలజడి రేగింది. వెంటనే డ్రైవర్ బస్సు ఆపేశాడు. ఆమెకు అటూ ఇటూ ఉన్నవాళ్ళు ఈ లోకంలోకి వచ్చి "ఏం జరిగింది? వాడేమైనా డబ్బు దొంగిలించాడా?" అన్నారు.

"అవునండీ! నా జాకెట్టులో పెట్టిన డబ్బు ఎంత నేర్పుగా తీశాడో చూడండి. రెండువందనోట్లు ఉంచితే తీసేసింది కాక ఇంకా ఏదో చేయబోయాడు రాస్కెల్" అంటూ మరో దెబ్బ ఇటువైపు చెంప మీద కొట్టింది.

రెండు నిముషాల్లో ఇదంతా జరిగిపోయింది. ఆ వ్యక్తి షేపులు మారిపోయాయి. బట్టలు పీలికలైపోయాయి. అంతగా జరగడానికి కారణం ఒక్క సుందరే కాదు. బస్సులో వాళ్ళూ వాడిని బాదేశారు.

సుందరి అప్పుడంచి రసగొంతులోని సంతోషం బయటపడనీయని స్వరంతో— "ఇలాంటి వెధవల్ని దేహశుద్ధి చేసి వదలగూడదు. పోలీస్ స్టేషన్‌లో అప్పజెప్పి రిపోర్టు ఇవ్వాలి. లేకపోతే బుద్ధి రాదు" అంది.

అందమైన ఆడపిల్ల సుందరి. ఆ సందడిలో ఆమె పైట జస్ట్ ప్రక్కకు తొలగి ఉంది. అలాంటి తరుణంలో ఆమె ఏం చెప్పినా వారికి వేదమే! అలాగే జరిగింది.

అందరూ ఏకకంఠంతో "డ్రైవర్! దగ్గరున్న పోలీస్ స్టేషన్‌కి పోనీయ్" అన్నారు.

ఆ యువకుడు తేరుకుని "నేనేం చేయలేదండీ? నాకే పాపం తెలియదండీ!" అన్నాడు ఏడుపు ముఖం పెట్టుకొని.

"ఛీ! మంచి బట్టలెయ్యగానే సరికాదు. మంచి బుద్ధుండాలి. నోర్మూయ్ ముందు" బస్సులో ఉన్న ఒకాయన అన్నమాటలివి.

పాపం ఆ యువకుణ్ణి పోలీస్ స్టేషన్‌లో పడేసి రిపోర్టు ఇచ్చి వచ్చారు. సుందరి అందరికీ థాంక్స్ చెప్పింది.వాడి దగ్గరినుండి వసూలు చేసిన రెండు వంద నోట్లు అన్యాయపు ఆర్జనగా భావించి ఆ యువకుడిని కొట్టిన వారందరికీ డ్రింక్స్ ఇప్పించింది.

వారు పొంగిపోయారు— ఆమె మంచితనానికి.

"ఎలాగూ పోయిందనుకున్న డబ్బు దొరికింది. అందుకే అలా ఖర్చు పెట్టేశాను" అనేసింది సుందరి.

"ఏమిటే ఇదంతా! అతనిమీద నీకు ఎందుకంత కోపం?" కల్పన ప్రశ్నించింది. ఆ తర్వాత.

"ఏం లేదు. కుక్కకాటుకి చెప్పుదెబ్బ. అంతే!" సింపుల్‌గా జవాబిచ్చింది సుందరి.

*